అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తున్న బీజేపీ

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



సదుస్సులో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: బీఆర్ అంబేడ్కర్‌ను ప్రతి చిన్న విషయంలో కాంగ్రెస్ పార్టీ అవమానించిందని, దేశంలో బీజేపీ పార్టీ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఆర్‌కే పురంలోని స్ప్రెసీ హాబ్‌లో నిర్వహించిన మేధావుల సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశం అన్ని రంగాల్లో ముందుండాలని అప్పుడే ముందు ఆలోచనతో రాజ్యాంగాని రూపొదించారన్నారు. అంబేడ్కర్ దూర దృష్టితో చిన్న రాష్ట్రాలతో అభివృద్ధి సాధ్యమని ముందు చెప్పాడని అన్నారు. అంబేడ్కర్ సొంత పార్టీ పెట్టి పోటీ చేసినప్పుడు కాంగ్రెస్ పార్టీ కుట్రచేసి అంబేడ్కర్ గెలవకుండా చేశారని.. కానీ అప్పుడే పుట్టిన జన్ సంఘ్ నాయకులు మాత్రం అంబేడ్కర్‌కు మద్దతు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పేరాల శేఖర్‌జీ, తాడూరి శ్రీనివాస్, రాజ్ భూపాల్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, అందెల శ్రీరాములు యాదవ్, కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదబీమా చెక్కు అందజేత

చైతన్యపురి: ప్రమాదవశాత్తు మరణించిన వినియోగదారుడి కుటుంబ సభ్యులకు ప్రమాద బీమా చెక్కును ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి అందజేశారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని గాయత్రి కోఆపరేటివ్ బ్యాంక్‌లో గాయత్రి నిర్భయ సేవింగ్ అకౌంట్ ఉన్న మహబూబ్‌నగర్‌కు చెందిన అంసరాల మధన్‌మోహన్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ప్రమాద బీమా సౌకర్యం ద్వారా నామిని అయిన మృతుడి భార్య కన్యాకుమారికి రూ.లక్ష చెక్కును బుధవారం అందజేసినట్లు రీజనల్ హెడ్ జి. లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ బ్రాంచి మేనేజర్ బి.అశోక్‌కుమార్, సీనియర్ ఆఫీసర్ ఎస్.రంజిత తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

హస్తినాపురం: కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో స్థానికులు భాగస్వాములు అయితేనే త్వరితగతిన పూర్తవుతాయని అగ్రికల్చర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. కాలనీలో ఎంపీ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తమ కాలనీలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిన ఎంపీ ఈటల రాజేందర్‌కు కాలనీ తరపున కృతజ్ఞతలు అన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన రోహిత్ పటేల్‌కు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ. 60 వేల చెక్కును బుధవారం కార్పొరేటర్ లచ్చిరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో దినేష్ పటేల్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసానికి 600 దరఖాస్తులు

చాదర్‌ఘాట్: రాజీవ్ యువ వికాసం పథకానికి ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ నుంచి 600 దరఖాస్తులు వచ్చాయని అంబర్‌పేట తహసీల్దార్ వారాబాయి తెలిపారు. దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి అర్హుల జాబితాను త్వరలో విడుదల చేస్తామన్నారు.

మ్యాన్‌హోల్ పనులను పూర్తి చేయాలి

నాగోలు: కొత్తపేట డివిజన్ ఎస్‌ఆర్‌ఎల్ కాలనీలో జరుగుతున్న మ్యాన్‌హోల్ పనులను వెంటనే పూర్తి చేయాలని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ఆదేశించారు. కాలనీలో జరుగుతున్న మ్యాన్‌హోల్ పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గత 25 రోజులుగా ఎస్‌ఆర్‌ఎల్ కాలనీలో తాగునీటిలో డ్రైనేజీ నీరు కలుస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. వేసవి కావడంతో నీళ్లు రాక, సకాలంలో పనులు పూర్తి చేయక, ట్యాంకర్లు పంపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే ఉంటే వాటర్ బోర్డు ఆఫీస్ ముట్టడికి వెనుకాడబోమని హెచ్చరించారు.కార్పొరేటర్ వెంట సుధాకర్, బకారం సత్యనారాయణ, దత్తాత్రేయ, సుందర్ నారాయణ, అశ్విన్ సింగ్, తోట మహేందర్ యాదవ్, గట్టు మహేష్ కుమార్ ఉన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.15, వంకాయ రూ.18, బెండ రూ.28, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.09, క్యారెట్ రూ.19, దొండ రూ.23, ఆలుగడ్డ రూ.26, ఉల్లిగడ్డ రూ.17, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.15, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.60, చామగడ్డ రూ.35.

ఎల్బీనగర్ @గ్యాంగ్‌వార్

ఆధిపత్య పోరుతో దాడులు, హత్యలు



అల్లరి మూకలకు కేరాఫ్‌గా.. | వరుస హత్యలతో కలకలం

ఎల్‌బీనగర్ జోన్ వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్నపాటి విషయాతో తలెత్తే వాగ్వాదాలు హత్యలకు దారి తీస్తున్నాయి. యువకులు గ్యాంగ్‌లు ఏర్పాటు చేసుకొని ఒక్కో గ్యాంగ్‌కు ఒక్కో పేరు పెట్టుకుంటున్నారు. ఈ గ్యాంగ్‌ల మధ్య ఆధిపత్య పోరులో హత్యలు జరుగుతున్నాయి. మద్యం మత్తులో ఉంటున్న యువకులు తరుచూ చిన్న పాటి విషయాలకు గొడవలకు దిగుతున్నారు. ఎల్‌బీనగర్, నాగోలు, సరూర్‌నగర్, చైతన్యపురి, వనస్థలిపురం, హయత్‌నగర్, మీర్‌పేట, అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం అల్లరి మూకలు గొడవలకు దిగుతున్నారు. – నాగోలు



చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో కొత్తపేట వద్ద రోడ్డుపై కత్తులతో దాడి చేస్తున్న దృశ్యం(ఫైల్)



ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కారు ఢీ కొట్టి హత్య చేసిన దృశ్యం(ఫైల్)

పేదలు, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా నివాసముండే ఎల్‌బీనగర్ పరిధిలోని భరత్‌నగర్ కాలనీ, రాజీవ్‌గాంధీనగర్, ఎన్టీఆర్‌నగర్, జైపురికాలనీ, బండ్లగూడ, సర్వే నెంబర్ 58, సాహెబ్‌నగర్, నందనవనం, భూపేష్‌గుప్తానగర్, మన్సూరాబాద్, సరూర్‌నగర్, కొత్తపేట, మున్సిపాల్ కాలనీ, హకీమాబాద్, గుట్టి జంగయ్యనగర్, పాత ఎల్‌బీ నగర్, మసీద్ గల్లీ, చింతలకుంట, హయత్‌నగర్ పరిధిలోని కుంట్లూరు, పసుమాముల, ఆర్‌కేనగర్, తట్టి అన్నారంతో నగర శివారు ప్రాంతంలో యువకులు గ్యాంగ్‌లు ఏర్పాటు చేసుకొని గొడవలతో స్థానికులను భయాందోళనకు గురి చేస్తున్నారు.

నాయకుల అండనా ?

అయితే.. రాజకీయ నాయకులు తమ అవసరాల కోసం వీరిని ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఏదైన గొడవలు, పోలీస్ స్టేషన్‌లో కేసులు, జైలుకు వెళ్తే వెనుకాల మా నాయకుడు ఉన్నాడనే ధైర్యంతో యువకులు దాడులకు పాల్పడుతున్నారు. ఫ్రెండ్లి పోలీస్ వ్యవస్థ వచ్చిన తర్వాత యువకులు పోలీసులకు సైతం బయపడే పరిస్థితి లేదు. ఈ క్రమంలో ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో జరుగుతున్న గొడవలు, హత్యలకు పోలీసులు నివారించే పరిస్థితి లేకుండా పోయింది. ఎల్‌బీనగర్ పరిధిలో లా అండ్ ఆర్డర్ కంట్రోల్ చేసే పరిస్థితి కనిపించడం లేదు. యువకుల మధ్య ఏర్పడిన చిన్న గొడవలకు పోలీసులు కేసు నమోదు చేసి స్టేషన్ బెల్ ఇచ్చి పంపడంతో యువకులు తరుచూ గొడవలు పడటం, హత్యలు సైతం చేసేందుకు వెనకాడటం లేదని స్థానికులు వాపోతున్నారు.

ఇటీవల జరిగిన హత్యలు..

- చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో గత డిసెంబర్ 20న ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన పురుషోత్తం, భరత్ నగర్ కాలనీ చెందిన బోడ్డు మహేష్ నడుమ పాత కక్షల నేపథ్యంలో మహేష్ తన అనుచరులతో నాగోలు రోడ్డులో ఉన్న పురుషోత్తం అతని స్నేహితులు రాము, నాగరాజులపై వేట కొడవళ్లతో విచక్షణారహితంగా దాడిచేసి పారిపోయారు. ఈ సంఘటనలో పురుషోత్తం తప్పించుకున్నారు. ఈ సంఘటనలో పోలీసులు దాడి చేసిన నిందితులను జైలుకు పింపించారు. జైలు నుంచి వచ్చిన తర్వాత మహేష్‌ను హత్య చేయాలని పురుషోత్తం ప్లాన్ చేసుకున్నాడు.
- మార్చి 23 రాత్రి సమయంలో బొడ్డు మహేష్ తన స్నేహితుడితో ద్విచక్ర వాహనంపై వెళ్లి ఇంటికి వస్తుండగా పురుషోత్తం తన అనుచరులు కారుతో ఢీ కొట్టి కింద పడగానే గొడ్డళ్లు, వేట కొడవళ్లతో దాడిచేసి హత్య చేశారు. ఈ సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించింది.
- ఈ నెల 8న రాత్రి ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బడంగ్‌పేటకు చెందిన లక్ష్మిని గుర్తు తెలియని వ్యక్తులు బైక్ వచ్చి ఆమెపై కత్తులతో దాడి చేశారు. ఈ క్రమంలో ఆమె ఛాతీ, ముఖం, కడుపులో పొడిచి పారి పోయారు. రెండు రోజులు హాస్పిటల్‌లో చిక్సిత పొందుతూ లక్ష్మి మృతి చెందింది. నిందితులు ఇప్పటికి వరకు దొరకలేదు.
- ఈ నెల 13న సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులపై స్థానిక యువకులు దాడి చేసి గాయపరిచారు. ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన యువకులను స్టేషన్ ముందే మరోసారి దాడి చేశారు..ఈ సంఘటనలో యువకులు తీవ్రంగా గాయపడ్డారు.
- ఈ నెల 20న చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో నాగోలు విలేజ్‌కు చెందిన పంగా మనోజ్‌ను పాత కక్షల నేపథ్యంలో జైపురికాలనీ చెందిన సంజయ్ మరి కొంత మంది కత్తులతో దాడి చేసి హత్య చేశారు.
- ఈ నెల 20 వ తేదీన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో మూసీలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు.అతనిది హత్యనా? ఆత్మహత్యనా? ఇంత వరకు వివరాలు తెలియలేదు.
- ఈనెల 21న నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో యువకుల మధ్య ఏర్పాడిన వివాదంలో దేవీ రామ్ అనే యువకుడిని తన స్నేహితులు ముకేష్ కుమార్, యోగేష్‌కుమార్ కత్తితో దాడి చేసి హత్య చేశారు.

యువకుడి హత్య కేసులో ముగ్గురి రిమాండ్

చైతన్యపురి: యువకుడిని హత్య చేసిన ఘటనలో ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు వివరాల ప్రకారం.. ఓల్డ్ నాగోల్ విలేజ్‌కు చెందిన వంగ మనోజ్ (21) జైపురికాలనీకి చెందిన సంజయ్ స్నేహితులు. తనకు నచ్చని స్నేహితులతో ఎందుకు మాట్లాడుతున్నావని సంజయ్‌పై కోపం పెంచుకున్నాడు. గతేడాదిలో ఇదే విషయంలో మాటామాటా పెరిగి మనోజ్ ఆవేశంగా కత్తితో సంజయ్‌పై దాడి చేశారు. ఈ ఘటనపై ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా పెద్దల సమక్షంలో రాజీ కుదిర్చారు. రాజీ కోసం సంజయ్ రూ.3 లక్షలు తీసుకున్నాడు. అయినా మనోజ్‌పై కోపం తగ్గలేదు. గత శనివారం అర్ధరాత్రి మనోజ్ నాగోల్ క్రాస్‌రోడ్డు వద్ద టిఫిన్ చేస్తున్నాడని తెలుసుకున్న సంజయ్ ముగ్గురు స్నేహితులతో అక్కడికి వెళ్లి స్కూటీపై కూర్చున్న మనోజ్‌ను కత్తితో కడుపు, వీపులో పొడవడంతో పాటు మెడకోసి హత్య చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రధాన నిందితుడైన సంజయ్‌తో పాటు అతడి స్నేహితులు గన్నోజు మహేష్ (24), మామిళ్ల నరసింహ (25)ను రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మరో నిందితుడు పవన్ పరారీలో ఉన్నాడన్నారు.



నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు..

ఎల్‌బీనగర్ ప్రాంతంలో వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రరణకు పటిష్ట చర్యలు చేపడుతున్నాం, బస్తీల్లో రాత్రి వేళలో విస్తృత తనిఖీలు నిర్వహించి అనుమానితులపై కేసులు నమోదు చేస్తున్నారం. ఆర్ధరాత్రి వరకూ రోడ్లపై సంచరించే యువకులపై కేసులు నమోదు చేస్తున్నాం.

ప్రవీణ్‌కుమార్–ఎల్‌బీనగర్ డీసీపీ..

అవయవదానం



వెంకట్‌రెడ్డి (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపాడో ఓ రైతు. జీవన్‌ధాన్ ప్రతినిధుల వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కన్నెకల్ మండలం గారా కుంటపాలెం గ్రామానికి చెందిన గార్లపాటి వెంకట్‌రెడ్డి (75) ఈ నెల 18న తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఆకస్మాతుగా కిందపడి పోయాడు. కుటుంబ సభ్యులు ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్‌కు తరలించగా చికిత్సకు స్పందించకపోవడంతో ఈ నెల 22న బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. విషయం తెలుసుకున్న జీవన్‌ధాన్ ప్రతినిధులు వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యుల అంగీకారంతో లివర్, రెండు కార్నియాలను జీవన్‌ధాన్‌కు ప్రదానం చేశారు.

నిషేధిత సిగరెట్ల విక్రేత రిమాండ్



పుల్లయ్య

హస్తినాపురం: నిషేదిత సిగరెట్లను విక్రయిస్తున్న ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హుడాకాంప్లెక్స్‌లో ఉన్న పూర్ణిమ ట్రేడర్స్ షాపులో నిషేధిత సిగరెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం రాత్రి తనిఖీలు చేసి వివిధ రకాల సిగరేట్ల ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. షాపు యజమాని సోమిశెట్టి పుల్లయ్య (67)ను రిమాండ్‌కు తరలించాలమన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభోత్సవంలో జీఎం శ్రీనివాస్‌రెడ్డి

వనస్థలిపురం: వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎన్జీవోస్‌కాలనీ బస్టాప్‌లో సామాజిక కార్యకర్త గద్దె విజయ్‌నేత ఆధ్వర్యంలో ముత్తూస్ జార్జ్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన కూలింగ్ రిఫ్రిజిరేటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం రాజగోపాల్, మేనేజర్ భవ్య, కాలనీవాసులు వెంకటేశ్వర్ రావు, సత్యనారాయణ, దశరథ్ నేత, అశోక్, వేణు, శ్రీనివాస్ నేత, మనీష్, ఉదయ్‌రెడ్డి, నిరంజన్, అనిల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నాగోలు: ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని నాగోలు డివిజన్ జైపురికాలనీ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం బత్తుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల (పీటీఎం) సమావేశం నిర్వహించి విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా వెనుకబడిన విద్యార్థుల సామర్థ్యాలను పెంపొదించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం తల్లిదండ్రులు విద్యార్థులతో కలిసి బడిబాట ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంతరెడ్డి, మేరీబ్యూల, రమాదేవి, సుధారాణి తల్లి దండ్రులు పాల్గొన్నారు.

'భూభారతి'తో సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

హయత్‌నగర్: రైతులకు భూమి కన్న తల్లి లాంటిదని రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం హయత్‌నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో భూభారతిపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గతంలో ఉన్న ఆర్‌ఓఆర్ చట్టం స్థానంలో వచ్చిన ధరణి పోర్టల్‌తో రైతులు అనేక ఇబ్బందులు పడేవారని ఆ చట్టంలో మార్పులు చేసే అధికారం ఎవ్వరికి లేకపోవడంతో రైతులు సమస్యలు ఎదుర్కొన్నారన్నారు. భూభారతి చట్టంతో రైతులకు ఎలాంటి గెట్టు పంచాయితీలు, వారసత్వ మార్పిడిలు ఉన్నా పరిష్కారం అవుతాయన్నారు. మన్సూరాబాద్ డివిజన్‌లోని వీరన్నగుట్ట భూమి కబ్జాల పాలవుతుందని, దాన్ని అడ్డుకోవాలని కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకురాగ, హయత్ నగర్‌లో రాచ కాలువ పూర్తిగా ఆక్రమణకు గురైందని దానిని వెంటనే పునరుద్ధరించాలని కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి కోరారు. సర్వే నెంబర్ 255లో రైతుల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూమిని వారికి రెగ్యులరైజ్ చేయాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అనంతరెడ్డి, అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్ తహసీల్దార్ జానకి, రైతు సహకార సంఘం చైర్మన్ చామ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

'మా ఉద్యోగాలు మాకు ఇవ్వాలి'



నిరసన తెలుపుతున్న సిబ్బంది

చాదర్‌ఘాట్: తమ ఉద్యోగాలు తమకు ఇవ్వాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అవుట్ సోర్సింగ్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం అధ్యక్షుడు రవీందర్ పేర్కొన్నారు. తమ ఉద్యోగాలు తమకు ఇవ్వాలని కోరుతూ చాదర్‌ఘాట్‌లోని జీహెచ్‌ఎంసీ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం ఎదుట జీహెచ్‌ఎంసీ ట్రాన్స్‌పోర్ట్ విభాగం అవుట్ సోర్సింగ్ సిబ్బంది ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడాది క్రితం ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సుమారు 814 మంది సిబ్బందిని డీఆర్‌ఎఫ్ సంస్థకు పంపించారని ప్రస్తుతం అక్కడి నుంచి జీహెచ్‌ఎంసీ ట్రాన్స్‌పోర్ట్ విభాగానికి పంపిస్తున్నామని ఫోన్ ద్వారా సమాచారం అందించారన్నారు. ఎలాంటి లిఖిత పూర్వక ఆదేశాలు రాలేదన్నారు. తమను జీహెచ్‌ఎంసీ అధికారులు విధుల్లోకి తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత 20 ఏళ్ల నుంచి జీహెచ్‌ఎంసీ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నామని వెంటనే తమ ఉద్యోగాలు తమకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జయ, మహేష్, సునీల్, జానీ, శ్రీశైలం పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

హయత్‌నగర్: గుర్తు తెలియని ఓ మృతదేహన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పెద్ద అంబర్‌పేట్ ఔటర్ రింగ్‌రోడ్డు సర్వీసు రోడ్డు పక్కన ఉన్న చెక్ డ్యాంలో మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి బయటికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి వయస్సు 25 ఏళ్లు ఉంటుందని, మృతికి కారణం తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

పిల్లలతో సహా గృహిణి అదృశ్యం



సుకన్య

హయత్‌నగర్: తన పిల్లలతో సహా ఓ గృహిణి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..పెద్దఅంబర్‌పేట్ సత్తిరెడ్డి కాలనీకి చెందిన అంగడి జంపయ్య భార్య సుకన్య (35) స్థానికంగా సీసాల కంపెనీలో పని చేస్తుంది. ఈ నెల 18న తనకు మటన్ ఆర్డర్ ఉందని జంపయ్య ఇల్లందుకు వెళ్లాడు. 20న భర్త ఫోన్ చేయగా స్పందన రాలేదు. ఇంటికి వచ్చిన జంపయ్యకు భార్యతో సహా పిల్లలు అనుష్క(15), సాయి చరణ్(13) కనిపించలేదు. బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో జంపయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జంపయ్య, సుకన్యకు గతంలోనే వేర్వేరుగా వివాహం అయ్యింది. విడాకులు తీసుకున్న తర్వాత ఇద్దరు ప్రేమ వివాహం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కార్యాలయం తరలింపు

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని జాతీయ వికలాంగుల పార్కులోకి వికలాంగుల సహకార సంస్థ కార్యాలయాన్ని తరలిస్తామని ఆ శాఖ ఎండీ శైలజ తెలిపారు. గతంలో ఈ స్థలంలో మలక్‌పేట సర్కిల్–6 కార్యాలయం ఉండేదని కొన్ని రోజుల క్రితం ఈ కార్యాలయం అక్బర్‌బాగ్ డివిజన్‌లోని మారిన దరిమిలా టీవీసీసీ కార్యాలయాన్ని తరలిస్తున్నట్లు తెలిపారు. వెంటనే కార్యాలయం బోర్డు ఏర్పాటు చేసి జీహెచ్‌ఎంసీ పాత సర్కిల్ కార్యాలయానికి షిఫ్ట్ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఉగ్రవాదుల దిష్టి బొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు

మన్సూరాబాద్: జమ్ము కశ్మీర్‌లో టూరిస్టులపై దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను ఉపేక్షించేది లేదని బీజేపీ సీనియర్ నేత సామ రంగారెడ్డి, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి స్పష్టం చేశారు. ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో బుధవారం ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాంతి భద్రతలను భంగపరిచే చర్యలతో అమాయక పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడులకు పాల్పడటం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, పవన్ కుమార్, కళ్లెం నవజీవన్‌రెడ్డి, నాయకులు బండారి భాస్కర్, నాంపల్లి రామేశ్వర్, హరీష్‌రెడ్డి, ఎంజాల జగన్ పాల్గొన్నారు.

పాకిస్థాన్ జెండా దహనం..

చైతన్యపురి: కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బుధవారం మధురాపురి కాలనీ నుంచి దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్ చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాకిస్థాన్ జెండాకు చెప్పుల దండవేసి ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దహనం చేశారు. కార్యక్రమంలో అనంతాచారి, మదుసూధన్‌రెడ్డి, శ్రీనివాసచారి, ప్రవీణ్, శివ, చక్రి, మోహన్, సురేష్ పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ..

దిల్‌సుఖ్‌నగర్: పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ కొత్తపేట చౌరస్తాలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో చేవెళ్ల ఎంపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమాయకులైన టూరిస్టులపై ఉగ్రవాదుల దాడి పిరికి పంద చర్య అన్నారు. కశ్మీర్ అభివృద్ధిని ఓర్చుకోలేని వారు దాడికి పాల్పడ్డారని త్వరలోనే సైన్యం ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెబుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పేరాల శేఖర్‌జీ, తాడూరి శ్రీనివాస్, రాజ్ భూపాల్‌రెడ్డి, పిట్ట ఉపేందర్‌రెడ్డి, అందెల శ్రీరాములు యాదవ్, కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి, కొప్పుల భాషా పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



జెండాను ఎగరవేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం చంపాపేట బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి ఆధ్వర్యంలో చంపాపేట గాంధీ విగ్రహం చౌరస్తా, కర్మన్‌ఘాట్ వైఎస్ఆర్ విగ్రహ చౌరస్తా, బైరామల్‌గూడ చౌరస్తాలో ఏర్పాటు చేసిన జెండాలను ఆయన ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో రవిముదిరాజ్, రాము, లక్ష్మణ్, మేక సురేందర్‌రెడ్డి, సదానందరెడ్డి, రాము, ప్రభాకర్, శ్రీనివాస్, యాదగిరి, తిరుపతిరెడ్డి, రమాదేవి, శోభ, వసంత పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

సైదాబాద్: రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న కాంగ్రెస్ పార్టీకి త్వరలో ప్రజలే చరమ గీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని బీఆర్‌ఎస్ యాకత్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జి సామ సుందర్‌రెడ్డి అన్నారు. ఐఎస్‌సదన్ డివిజన్ ఎస్ఎన్‌రెడ్డి కాలనీలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన నాయకులతో కలిసి రజతోత్సవ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 25 బహిరంగ సభకు పాతబస్తీ నుంచి లక్ష మందిని తరలించి రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను తప్పుడు హామీలతో మభ్యపెడుతుందని ఆరోపించారు. ఈ సమావేశంలో భాస్కర్‌రెడ్డి, నర్సింగరావు, చింతల శ్రీనివాస్, సాబేర్, సీఎం ప్రవీణ్, సాయిబాబా పాల్గొన్నారు.